7

సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 14 । జనవరి । 2025

గరిష్టం / కనిష్టం
32° / 17°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.



జూలూరుపాడు: వెంగన్నపాలెంలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మహిళలు

న్యూస్‌రీల్‌

ముక్కోటికి పెరిగిన టికెట్ల ఆదాయం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఈనెల 10వ తేదీన నిర్వహించిన ముక్కోటి ఏకాదశి వేడుకకు టికెట్ల ద్వారా ఆదాయం పెరిగింది. గతేడాది జరిగిన ముక్కోటికి టికెట్ల అమ్మకం ద్వారా రూ. 28,79,750 సమకూరగా, ఈ సంవత్సరం టికెట్ల విక్రయం ద్వారా రూ.34,77,750 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్‌ టికెట్ల విక్రయం ముందుగానే ప్రారంభించడంతో పూర్తిగా అమ్ముడయ్యాయి. ఇక రెవెన్యూ శాఖ ద్వారా కొన్ని టికెట్లు విక్రయించారు. అయితే ఎన్ని టికెట్లు అమ్ముడయ్యాయి, వాటి ద్వారా వచ్చిన ఆదాయాన్ని రెవెన్యూ అధికారులు ఇంకా ఆలయానికి చెల్లించలేదు. అది కూడా సమకూరితే ఆదాయం మరింతగా పెరిగే అవకాశం ఉంది.

పెద్దమ్మతల్లికి భోగి పండ్లతో అభిషేకం



అమ్మవారికి భోగిపండ్లు పోస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్‌: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో భోగి సందర్భంగా సోమవారం అర్చకులు అమ్మవారికి రేగుపండ్లు, పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం యాగశాలలో చండీహోమం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న 16 మంది దంపతులకు ఈఓ రజనీకుమారితో కలిసి అర్చకులు అమ్మవారి శేష వస్త్రాలు అందించారు.

కలెక్టర్‌ సంక్రాంతి శుభాకాంక్షలు

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ ఆకాంక్షించారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో నూతన కాంతులు తీసుకురావాలని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా మరో ప్రకటనలో ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లెందు : ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ కూడా మరో ప్రకటనలో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

16న ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్‌: జూనియర్‌ బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపికకు ఈనెల 16న పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. వివిధ అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని, ప్రక్రియను కోచ్‌లు గొంది మారప్ప, నగేష్‌, కల్యాణ్‌ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఖమ్మం సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో జరిగే పోటీలకు క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, వివరాలకు 93946 43139 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.





కొత్తగూడెంలో ముగ్గు వేస్తున్న యువతి



ఆకట్టుకుంటున్న సంక్రాంతి ముగ్గు

సరదాల సంక్రాంతి

జిల్లాలో ఘనంగా భోగి వేడుకలు

- లోగిళ్లలో రంగవల్లులు.. పల్లెలకు కొత్త శోభ
- ఊరూ..వాడ సందడే సందడి



రామవరంలో భోగి మంటలు వేసి సంబురాలు జరుపుకుంటున్న మహిళలు, చిన్నారులు

చుంచుపల్లి/కొత్తగూడెంటౌన్‌ : భోగభాగ్యాల భోగి పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు సోమవారం సంబరంగా జరుపుకున్నారు. భోగి మంటలు వేయడంతో సకల దోషాలకు పరిహారం లభిస్తుందని నమ్మకం. పీడలు తొలిగిపోతాయనే నమ్మకంతో పాత వస్తువులను, పనికి రాని వస్త్రాలను మంటల్లో వేసి కాల్చేశారు. చెడు తలంపులను భోగి మంటల్లో వేసి, నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని కోరుకున్నారు. ఇక ఇళ్ల లోగిళ్లలో రంగవల్లులు.. కొలువుదీరిన గొబ్బెమ్మలు.. ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతూ హరిదాసుల కీర్తనలు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. ఇలా పల్లె, పట్టణం తేడా లేకుండా అంతటా సందడి వాతావరణం నెలకొంది.

ముచ్చటగా మూడు రోజులు..

జిల్లాలో సంక్రాంతి సంబరాలు సరికొత్త శోభ సంతరించుకున్నాయి. సోమవారం భోగి వేడుకలు ముగియగా, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగలు జరుపుకోనున్నారు. ఇంటిముందు అందమైన ముగ్గులు వేసి వాటి మధ్య గొబ్బెమ్మలను పెట్టి పూజిస్తారు. వాటిని గోదాదేవి, లక్ష్మీదేవి, గౌరీమాతగా భావిస్తారు. భోగి పండుగ సందర్భంగా చిన్నారుల తలపై రేగుపండ్లు పోసి ఆశీర్వదించారు. సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం

గోవిందరాజస్వామి ఆలయంలో రాపత్తు సేవ

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని గోదాదేవి – రంగనాథ స్వామి వార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు అంతరాలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా బేడా మండపానికి తీసుకొచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని, గోదా రంగనాథస్వామి వార్ల కల్యాణ వేడుకను కమనీయంగా జరిపించారు. సోమవారం సందర్భంగా అంతరాలయంలో మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. సంక్రాంతి సెలవులు కావడంతో రామాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆర్జిత సేవల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాపికొండల పర్యాటకానికి సైతం బారులుదీరారు.



గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామయ్యకు ఘనంగా రాపత్తు సేవ..

అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం తాత గుడి సెంటర్‌లో ఉన్న గోవిందరాజ స్వామి ఆలయంలో రామచంద్రస్వామి వారికి ఘనంగా రాపత్తు సేవ జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని మంగళవాయిద్యాలు, భక్తుల శ్రీరామనామస్మరణల నడుమ పల్లకీ సేవగా ఆలయం వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామాలయంలో బారులుదీరిన భక్తులు


కొనసాగుతున్న పర్యాటకుల సందడి

కిన్నెరసానిలో ఒకరోజు ఆదాయం రూ.63,070

పాల్వంచరూరల్‌ : సంక్రాంతి సెలవుల నేపథ్యంలో మండల పరిధిలోని కిన్నెరసానిలో పర్యాటకుల సందడి కొనసాగుతూనే ఉంది. జిల్లా నలుమూలలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. సోమవారం 921 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్‌ శాఖకు రూ.31,610 ఆదాయం లభించగా, 620 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.31,460 ఆదాయం సమకూరిందని నిర్వాహకులు తెలిపారు. కాగా, మంచిర్యాల ఎఫ్‌డీఓ వేణుబాబు సోమవారం కిన్నెరసానిని సందర్శించారు. ఈ సందర్భంగా డీర్‌పార్కులోని జింకలను, జలాశయాన్ని వీక్షించారు. ఆయన వెంట ఎఫ్‌ఎస్‌ఓ కిషన్‌, ఎఫ్‌బీఓ రాములు తదితరులు ఉన్నారు.



కిన్నెరసాని బోటింగ్‌ పాయింట్‌ వద్ద పర్యాటకులు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్‌, ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్‌, కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్‌, పాటిల్‌

గణతంత్రం నుంచే గ్యారంటీలు

- జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అర్హులకు పథకాలు చేరడం ఎంత ముఖ్యమో, అనర్హులను ఎంపిక చేసి ప్రజాధనం వృథా కాకుండా చూడడం కూడా అంతే ముఖ్యమన్నారు. రానున్న పది రోజులు అధికారులు కష్టపడి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఏ ఒక్క అనర్హుడికి పథకం అందినా కలెక్టర్లనే బాధ్యులుగా చేస్తామని తెలిపారు.

నాలుగు పథకాల అమలుకు సిద్ధం కావాలి

- అర్హులెవరూ నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే
- ఒక్క అనర్హుడికి సాయం అందినా కలెక్టర్లే బాధ్యులు
- ప్రభుత్వ మార్గదర్శకాలు తు.చ.తప్పకుండా అమలుచేయాలి
- సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

ఖమ్మంవన్‌టౌన్‌: ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా మరో నాలుగు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలుచేయనున్నందున అధికారులు సిద్ధం కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం ఆయన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లపై ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటికే అనేక పథకాలు అమలుచేయగా, మరో నాలుగు గ్యారంటీల అమలుకు సిద్ధమవుతోందని చెప్పారు. ఈ పథకాలకు దాదాపు రూ.45 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు రూ.22,500 కోట్లు, రైతు భరోసాకు రూ.18వేల కోట్లు వెచ్చించనున్నామని చెప్పారు. ప్రతీ పథకంపై కూలంకషంగా చర్చించి మార్గదర్శకాలు రూపొందించినందున అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులెవరూ నష్టపోకుండా చూడాలని సూచించారు. లబ్ధిదారులను గ్రామసభలో ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అంతేకాకుండా జాబితాలను ఇన్‌చార్జ్‌ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆమోదించాక మంజూరు పత్రాలు జారీ చేయాలని తెలిపారు. అలాగే, పథకాల లబ్ధిదారుల వివరాలతో ప్రతీ గ్రామంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు.

- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పెద్దమొత్తంలో నిధులతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. నూతన రేషన్‌ కార్డుల జారీ, కొత్త సభ్యుల పేర్ల నమోదు నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కొత్త కార్డుల జారీలో అధికారులు మానవీయ దృక్పథంతో పనిచేయాలని సూచించారు.
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ యోగ్యం కాని భూములకు ఎక్కడా పెట్టుబడి సాయం అందకుండా చూడాలన్నారు. వెంచర్లు చేసిన, ప్రభుత్వం సేకరించిన భూములను గుర్తించేందుకు గ్రామ శాటిలైట్‌ మ్యాప్‌ను ఆధారంగా చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు పంట వేసినా, వేయకపోయినా రైతు భరోసా అందుతుందనే అంశంపై ప్రచారం చేయాలని తెలిపారు.
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలను అధికారులు పక్కాగా అమలు చేస్తూ పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. ప్రతీ గ్రామసభలో పథకాల అమలు నిరంతరం కొనసాగుతుందనే విషయాన్ని ప్రకటించాలని తెలిపారు. అలాగే, మార్గదర్శకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.
- ఖమ్మం, మహబూబాబాద్‌ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్‌ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేసేలా అత్యంత జాగ్రత్తగా పనిచేయాలని సూచించారు.
- ఖమ్మం కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ మాట్లాడుతూ పథకాల అమలుపై ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సెల్‌ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈనెల 24 నాటికి లబ్ధిదారుల తుది జాబితాను సిద్ధం చేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితా రూపొందిస్తామని వెల్లడించారు.
- భద్రాద్రి కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌ మాట్లాడుతూ రైతు భరోసా, రేషన్‌కార్డులు అర్హులకు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆధారంగా రేషన్‌ కార్డులు లేని అర్హులకు అందేలా గ్రామసభల్లో నిర్ణయిస్తామని పేర్కొన్నారు.


ఇంకా ఈ సమావేశంలో పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, మట్టా రాగమయి, కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, మాలోత్‌ రాందాస్‌నాయక్‌ పలు సూచనలు చేయగా అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ, ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌, ఖమ్మం సీపీ సునీల్‌దత్‌, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్‌, ఖమ్మం మేయర్‌ పి.నీరజ, హస్తకళల సంస్థ చైర్మన్‌ నాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, వెంకట్రావు, ఆదినారాయణ, పాయం, కనకయ్య, రాందాస్‌, హస్తకళల సంస్థ చైర్మన్‌ సత్యం



సమీక్షలో పాల్గొన్న ఖమ్మం సీపీ సునీల్‌దత్‌, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్‌, ఖమ్మం అదనపు కలెక్టర్‌ శ్రీజ, ఐటీడీఏ పీఓ రాహుల్‌



రీజియన్‌ పరిధిలో తేదీల వారీగా బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులు (లక్షల్లో)

తేదీ	06	07	08	09	10	11	12
ప్రయాణికుల సంఖ్య	2.36	2.13	2.26	2.35	2.34	2.38	2.50

ఆర్టీసీ రికార్డు బ్రేక్‌!

- ఈనెల 12న 2.50 లక్షల మంది ప్రయాణం
- రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో రాకపోకలు
- వారం రోజుల్లో ప్రయాణించిన 16లక్షల మంది..

ఖమ్మంమయూరిసెంటర్‌: సంక్రాంతి పండుగ సందర్భంగా నగరాలు, పట్టణాల నుండి స్వస్థలాలకు బయలుదేరిన లక్షలాది మంది ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. వారం రోజుల్లో 16.32లక్షల మందికి పైగా ప్రయాణికులు ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. అత్యధికంగా ఈనెల 12న ఆదివారం ఒకేరోజు 2.50 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించడం రికార్డుగా నమోదైంది. మునుపెన్నడూ ఈ స్థాయిలో ప్రయాణికుల సంఖ్య నమోదు కాలేదని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. సంక్రాంతి రద్దీకి అనుగుణంగా అధికారులు ముందుగానే ప్రణాళికాయుతంగా బస్సులు ఏర్పాటుచేసి పర్యవేక్షించడంతో ప్రయాణం సాఫీగా సాగింది. వారం రోజులుగా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడానికి చేసిన కృషిని అంతా అభినందిస్తున్నారు. కాగా, 12వ తేదీన ఆదివారం ఒకేరోజు ఖమ్మం డిపోకు గరిష్ట స్థాయిలో రూ.48,57,372 ఆదాయం సమకూరడం విశేషం.

మహిళా ఉద్యోగులకు రెస్క్యూపై అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): భూగర్భ గనుల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు రెస్క్యూపై అవగాహన కల్పించేందుకు యాజమాన్యం కార్యక్రమాలను రూపొందిస్తోంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. భూగర్భ గనుల్లో పనిచేసే మహిళల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సంస్థ ఉన్నతాధికారులు వెల్లడించారు. గనుల్లో రెస్క్యూ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయి రెస్క్యూ పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన అర్హతలను తెలిపారు. మైన్స్‌ రూల్స్‌ 1985 ప్రకారం 21 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి ఉండాలని, విద్యార్హత కనీసం ఎస్సెస్సీ ఉండాలని, భూగర్భ గనుల్లో కనీస అనుభవం, జ్ఞానం ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 20న ఆర్జీ–2లోని మైన్స్‌ రెస్క్యూ స్టేషన్‌లో, 22న, మందమర్రి ఏరియాలోని ఆర్‌ఆర్‌ఆర్‌టీలో, 24న భూపాలపల్లి ఏరియాలోని ఆర్‌ఆర్‌ఆర్‌టీలో, 29న, కొత్తగూడెంలోని ఆర్‌ఆర్‌ఆర్‌టీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.



సింగరేణి ప్రధాన కార్యాలయం

గాయత్రీ జ్ఞానపీఠంలో ముగిసిన పూజలు

మణుగూరురూరల్‌: మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీలోని గాయత్రీ జ్ఞాన పీఠంలో 25వ వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి దయానికి వసంతాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి గురుపూజ, వేద గాయత్రీ మహాయజ్ఞం, గణపతి పూజ, పుణ్యావాచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పీఠాధిపతులు రామడుగు నరసింహాచార్యులు, శ్రీకాంత్‌, ఇంద్ర స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

పందెంరాయుళ్ల అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లు

టేకులపల్లి: మండలంలోని బర్లగూడెం పంచాయతీ మొట్లగూడెం సమీప అటవీ ప్రాంతంలో ఉన్న కోడి పందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకోగా, మరికొందరు పరారయ్యారు. రూ.59 వేల నగదు, 18 కోళ్లు, 8 ఫోన్లు , 16 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు బోడు ఎస్‌ఐ పాడిశెట్టి శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాద స్థలిలో క్షతగాత్రులు

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం కేసుపల్లి నుంచి ఆటోలో ఐదుగురు కొత్తగూడెం వెళ్తుండగా, కొత్తగూడెం నుంచి జూలూరుపాడు వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వంశీ, మధు, డ్రైవర్ క్రాంతి, ట్రాలీలో ఉన్న కొత్తగూడేనికి చెందిన వీరభద్రం, ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించే క్రమాన సిబ్బంది సంతోష్, బి.కల్యాణ్ వైద్యసేవలు అందించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

చైనా మాంజాతో బాలుడికి..



మాంజా దారం కోసుకుని గాయపడ్డ బాలుడు

కొత్తగూడెంటౌన్: గాలి పటానికి ఉన్న మాంజా దారం తెగి బాలుడి కాలికి తగిలి తీవ్రగాయమైన సంఘటన సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని చిట్టి రామవరంలో జరిగింది. తల్లిదండ్రులు, స్థానికుల కథనం ప్రకారం.. చిట్టి రామవరానికి చెందిన బాదవత్ రమేష్ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రమేష్ కుమారుడు తమన్, తనకు వరుసకు సోదరుడైన వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై రామవరం మార్కెట్ నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎడమ కాలుకు మాంజా దారం చిక్కుకుని రెండు అంగుళాల మేర కోసుకుపోయింది. తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు డయల్ 100కు సమాచారం ఇవ్వండతోపాటు కొత్తగూడెంలోని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. పరిశీలించిన వైద్యులు కాలికి కుట్లు వేయాలని అన్నారని బాలుడి తండ్రి తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం..



మృతుడు శంకర్

భద్రాచలంటౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏరియా ఆస్పత్రికి వెళ్లే దారిలో అపోలో మెడికల్ షాప్ వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ప్రభుత్వాస్పత్రిలో మందులు తీసుకుని వాడుతుండేవాడని, ఆ రికార్డుల ఆధారంగా మృతుడు టి.శంకర్‌గా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. చిరునామా, పూర్తి వివరాలు తెలిసినవారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



రోహిత్ (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. బోడు ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని మొట్లగూడెం గ్రామానికి చెందిన ఈసం రోహిత్(19) టేకులపల్లి మండలంలోని బద్దుతండా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఆదివారం ఇంటికి వచ్చాడు. సోమవారం బైక్‌పై స్వగ్రామం నుంచి టేకులపల్లికి వస్తుండగా బోడు పంచాయతీ కారేపల్లితండా వద్ద అదుపు తప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సరిహద్దుల్లో పందెం కోఢీ!

- పుంజులతో సరిహద్దులోని ఏపీ గ్రామాలకు వెళ్లిన జనం
- భారీ సంఖ్యలో వాహనాలతో రాజమండ్రి మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం
- జీలుగుమిల్లిలో పందేలను ప్రారంభించిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే



అశ్వారావుపేటరూరల్ : ఏపీలో కోడి పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

బూర్గంపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని దారులన్నీ సరిహద్దుల్లోని ఆంధ్రా ప్రాంతాలకు దారితీశాయి. బూర్గంపాడు, అశ్వారావుపేట సమీపంలోని ఏపీ గ్రామాల్లో ఉన్న బిర్రులకు పందెంరాయుళ్లు తరలివెళ్లారు. ఉదయం 7గంటల నుంచే వందలాదిమంది కోళ్లను పట్టుకుని బూర్గంపాడుకు కూతవేటు దూరంలో ఉన్న ఆంధ్ర సరిహద్దులోని వేలేరు కోడి పందేల స్థావరాల వైపు పరుగులు తీశారు. మోటార్ సైకిళ్లు, కార్లు, ఆటోల్లో వేల సంఖ్యలో కోడిపందేలను వీక్షించేందుకు, ఆడేందుకు జిల్లా నుంచి తరలివెళ్లారు. బూర్గంపాడుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ కోడి పందేలకు హాజరైన వారిలో 80శాతం మంది జిల్లా వాసులే. కోడిపందేలతోపాటు పేకాట కూడా పెద్ద మొత్తంలో సాగింది. భోగి పండుగ రోజున కోడిపందేలు, పేకాటల్లో సుమారు రూ. 2 కోట్లు చేతులు మారి ఉంటాయని అంచనా. హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాల నుంచి కూడా పలువురు కార్లలో కోడి పందేలకు వెళ్లారు. పందెంరాయుళ్లు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో రాజమండ్రి–భద్రాచలం మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సాయంత్రం సమయంలో వేలేరు నుంచి బూర్గంపాడుకు 2 కిలోమీటర్లు వచ్చేందుకు సుమారు గంట సమయం పట్టింది. అటు ఆంధ్రా, ఇటు తెలంగాణ పోలీసులు కూడా మొక్కుబడిగానే బందోబస్తును పర్యవేక్షించారు. కోడిపందేల స్థావరాల వద్ద స్నాక్స్, కూల్‌డ్రింక్స్‌ను మూడింతల రెట్టింపు ధరలకు నిర్వాహకులు, వ్యాపారులు అమ్మకాలు జరిపారు.

భారీగా తరలిన పందెంరాయుళ్లు

అశ్వారావుపేటరూరల్: పలువురు జిల్లా వాసులు ఏపీ రాష్ట్రంలోని కోడి పందేలకు తరలివెళ్లారు. సోమవారం తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతాలైన ఏపీలోని జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంట, తాటియాకులగూడెం, రాచన్నగూడెం గ్రామాల్లో, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించారు. దీంతో పందెం రాయుళ్లు కోడి పుంజులతో తరలివెళ్లారు. ఉదయం నుంచే కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోల్లో సరిహద్దులోని బిర్రులకు చేరి పందేలు వేశారు. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు వెళ్లడంతో సరిహద్దు ప్రాంతాల్లో సందడి నెలకొంది.

ఎమ్మెల్యే చేతుల మీదుగా..

కోడి పందేలు నిర్వహించేందుకు పోలీసుల నుంచి అనుమతులు లేకపోవడంతోపాటు పలువురు ఆంధ్రా వెళ్లి పందేలు వేశారు. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బిర్రును అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. బిర్రును అశ్వారావుపేటకు చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు ఏర్పాటు చేయడంతో ఆయన అక్కడి వెళ్లి స్వయంగా ప్రారంభించారు. అనంతరం కొంతసేపు అక్కడే ఉండి, కోడి పందెలను వీక్షించారు. ఎమ్మెల్యేతోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ , ఆళ్ల నాగేశ్వరరావు ఉన్నారు.



బూర్గంపాడు-కుక్కునూరు రహదారిలో నిలిచిన ట్రాఫిక్

ఏపీకి తరలిన పందెం రాయుళ్లు



ఆంధ్రా ప్రాంతానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న పందెంరాయుళ్ల కార్లు

దమ్మపేట : పందెంరాయుళ్లు సోమవారం ఆంధ్రా బాట పట్టారు. సంక్రాంతి సందర్భంగా ఆంధ్రా ప్రాంతంలో నిర్వహించే కోడి పందేలు, గుండు పట్టాలు, కోసు తదితర జూద క్రీడలు ఆడేందుకు మండలంలోని పలు గ్రామాలవారు అధిక సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాల్లో తరలివెళ్లారు. ఏపీలో భారీ స్థాయిలో కోడిపందేలు నిర్వహించే భీమవరం, కొవ్వాక, నూజివీడు తదితర ప్రాంతాలకు రూ.లక్షలతో వెళ్లినట్లు తెలుస్తోంది. మరికొందరు సీతానగరం, అల్లిపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లారు. యువత, పెద్దలు పందేలకు వెళ్లడంతో మండల కేంద్రంలో జన సంచారం తగ్గిపోయింది.

డ్రోన్ కెమెరాలతో నిఘా...

కొత్తగూడెంటౌన్/అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: : కోడి పందేలు, పేకాట స్థావరాలపై పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. స్థావరాలు ఏర్పాటు చేసుకుని పేకాట ఆడుతున్నారు. దీంతో జిల్లా పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని ఏపీ సరిహద్దు గ్రామాల్లో రెండు డ్రోన్ కెమెరాలతో తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు గ్రామాలతోపాటు పామాయిల్, కొబ్బరి, మామిడి తోటల్లో, గెస్ట్ హౌస్‌లలో పందేలు నిర్వహించకుండా చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజు హెచ్చరించారు. కోడి పందేల కోసం తోటలు, గెస్ట్‌హౌస్‌లు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా కోడి పందేలు, బెట్టింగ్, పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించాలని జిల్లా పోలీసులను ఆదేశించారు. సరిహద్దుల్లోని అల్లిపల్లి, వడ్లగూడెం తదితర గ్రామాల శివారు ప్రాంతాల్లో సీఐ కరుణాకర్, ఎస్సైలు సాయికిషోర్ రెడ్డి, యయాతి రాజు డ్రోన్ల ద్వారా తనిఖీలు చేపట్టారు.



సరిహద్దు ప్రాంతంలో డ్రోన్‌తో పరిశీలిస్తున్న సీఐ కరుణాకర్ తదితరులు

తక్కువ ఖర్చు.. ఎక్కువ ఆయకట్టు

ఇదే మా ప్రభుత్వ ప్రాధాన్యత

- మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం, మంత్రులు



ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రులు

రఘునాథపాలెం: తక్కువ నిధులతో ఎక్కువ ఆయకట్టును సాగులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలో రూ.66 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేయగా ఆతర్వాత ఏర్పాటుచేసిన సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని 2,400 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా రూపొందించినట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలు గెలిపించిన నాయకులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని, ఆర్థిక, వ్యవసాయ, రెవెన్యూ, హౌసింగ్ శాఖలనీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. గత పాలకులు సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.8,500 కోట్లు వెచ్చించినా ఒక్క ఎకరం కూడా ఆయకట్టు సాగులోకి రాలేదని, ఈనేపథ్యాన పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని చెప్పారు. రానున్న నాలుగేళ్లలో సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తామని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత పాలకులు చేయలేని పనులను ఏడాది కాలంలోనే చేసి చూపించామన్నారు. జిల్లాలో వ్యవసాయం ప్రాధాన్యతగా ఉన్నందున ఇక్కడ వ్యవసాయధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ప్రతీ ఎకరానికి సాగునీరు అందేలా ప్రాజెక్టులు పూర్తిచేయడానికి నిధులు మంజూరు చేసే ఆర్థిక శాఖ మంత్రి ఇక్కడ ఉండడం మన అదృష్టమన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే వానాకాలం సీజన్ నాటికి మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు సరఫరా చేస్తామన్నారు. మున్నేరు జలాలను పాలేరు రిజర్వాయర్‌కు తరలించే ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత పాలకులు విచ్ఛిన్నం చేసినా అంతా సరిచేస్తూ హామీలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, బలరాం నాయక్, కలెక్టర్ ముజమ్మిలఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్‌పి.శ్రీజ, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నా యక్, కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, మేయర్ పి.నీరజ, డీసీసీబీ చైర్మన్ డి.వెంకటేశ్వర్లు, జలవనరులశాఖ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఈఈ అనన్య,డీఈ జాన్సీతో పాటు నాయకులు మానుకొండ రాధాకిషోర్, వాంకుడోత్ దీపక్, తాతా రఘురాం, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావీద్, బాలసాని లక్ష్మీనారాయణ, నల్లమల వెంకటేశ్వర్లు, కొంటిముక్కల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓసీ-4లో ప్రమాదం!

కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్రగాయాలు ?

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-4 గనిలో కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్రగాయాలు కాగా, అతడిని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నర్సింహారావు అనే కాంట్రాక్ట్ కార్మికుడు ట్రాక్టర్ డోజర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న క్రమంలో తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ట్రాక్టర్ పై నుంచి కింద పడినట్లు సమాచారం. అదే ట్రాక్టర్ వెనుక టైరు అతడి కాలిపై ఎక్కి లాక్కుంటూ వెళ్లగా, కాలు పూర్తిగా నుజ్జునుజ్జయినట్లు తెలిసింది. క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఓసీ-4 పీఓ అందుబాటులోకి రాలేదు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

చింతకాని: బోనకల్ మండలం లక్ష్మీపురంలో ట్రాక్టర్ మరమ్మతు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చింతకాని మండలం పాతర్లపాడు నుంచి బోనకల్ మండలం గోవిందాపురం వరకు బీటీ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు వినియోగిస్తున్న ట్రాక్టర్ పాతర్లపాడు సమీపాన సోమవారం ఆగిపోవడంతో డ్రైవర్ యంగల నవీన్ కిందకు దిగి పరిశీలిస్తున్నాడు. ఈక్రమాన ఒక్కసారిగా ఇంజన్ స్టార్ట్ అయి ముందుకు రావడంతో నవీన్ ఎడమ కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను 108 వాహనంలో సిబ్బంది కోట భానుసహాన్, మిడిదిడ్డి చక్రవర్తి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



శాంతమ్మ (ఫైల్)

తల్లాడ: మండలంలోని వెంగన్నపేటకు చెందిన శతాధిక వృద్ధురాలు తొండపు శాంతమ్మ(102) సోమవారం మృతి చెందింది. ఆమెకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శాంతమ్మ భర్త తొండపు నారాయణ రజాకార్లతో జరిగిన పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇంటి వద్దే కన్ను మూయగా బీజేపీ నాయకులు ఆపతి వెంకటరామారావు తదితరులు నివాళులర్పించారు.

ఆటో బోల్తా..

దమ్మపేట : గేదెలు అడ్డు రావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని గోపాలపురం గ్రామసమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఎనిమిది మంది ఆటోలో సొంత ఊరు నుంచి పాల్వంచకు శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు. ఈక్రమంలో ఆటో గోపాలపురం సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా, ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

















సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ఖమ్మం, సహకార నగర్, లయన్స్ క్లబ్ బిల్డింగ్ నందు కుట్టు మిషన్, బ్యూటీషియన్ & కంప్యూటర్ కోర్స్ నేర్పబడును. ఆసక్తిగల అభ్యర్థులు సం॥ 9848156328 [M-1256031]

Wanted

■Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256034]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.